## గ్రామస్తులు ఐకమత్యంగా ఉండాలి



మాట్లాడుతున్న డీఎస్పీ సీతారామయ్య

నందవరం: గ్రామాల్లో అందరూ కలిసి మెలసి శాంతియుత వాతావరణంలో జీవించాలని డీఎస్పీ సీతారామయ్య సూచించారు. ఆయన సోమవారం మండల పరిధిలోని పోనకలదిన్నె గ్రామంలో సీఐ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. ప్రశాంత పల్లెల్లో గొడవలు సృష్టిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అల్లర్లకు పాల్పడి జైలు జీవితం అనుభవించొద్దని హితవుపలికారు. విభేదాలుంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. ఏఎస్ఐ ఆనంద్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

## బాణసంచా విక్రయాలకు అనుమతి తప్పనిసరి

ఆలూరు రూరల్: దీపావళి పర్వదినం సందర్భంగా బాణసంచా విక్రయదారులు నిబంధనలు పాటించాలని ఆలూరు అగ్నిమాపక, విపత్తుల నిర్వహణ అధికారి ఖాద్రి సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. షాపుల మధ్య 3 మీటర్ల దూరం ఉండాలన్నారు. దుకాణాల ముందు రెండు డ్రమ్ముల నీటిని ఉంచుకోవాలి. 18 ఏళ్ల లోపు పిల్లలను పనిలో పెట్టుకోరాదు. పాడైపోయిన విద్యుత్ వైర్లు వాడరాదన్నారు. అగ్నిప్రమాదం సంభవిస్తే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించాలి, అలాగే బాణసంచా విక్రయ షాపులను స్థానిక సంత మార్కెట్‌లో ఏర్పాటు చేసుకోవాలన్నారు. రెండు రోజుల మాత్రమే విక్రయాలకు అనుమతిస్తామన్నారు.

## జగనన్నతోనే రాష్ట్ర భవిష్యత్తు



మాట్లాడుతున్న మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు: సంక్షేమం అభివృద్ధే ధ్యేయంగా సుపరిపాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో గెలిపించుకుంటే రాష్ట్రం మరింత ప్రగతి సాధిస్తుందని కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం స్పష్టం చేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం వివిధ మండలాలకు చెందిన జేసీఎస్, సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రానికి జగనన్న ముఖ్యమంత్రిగా ఉండాల్సిన ఆవశ్యకతను ప్రతి కార్యకర్త ఇంటింటికీ వెళ్లి వివరించి ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు. ఈ నెల 9వ తేదీ నుంచి వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి వెళ్లాలని, ప్రతి ఒక్కరినీ కలిసి ప్రభుత్వ అందించిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి, ప్రగతి కార్యక్రమాలను వివరించాలన్నారు. దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, జెడ్పీటీసీ సభ్యుడు ఏరూరు శేఖర్, నాయకులు వీరేష్, మారయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

పత్తికొండ రూరల్: పత్తికొండ–చక్రాళ్ల రోడ్డులో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తుగ్గలి మండలం బాటతండాకు చెందిన దావ్రేనాయక్ తీవ్రంగా గాయపడ్డాడు. బుగ్గతండాలోని బంధువుల ఇంటికి వచ్చి తమ్ముడు పాండురంగనాయక్‌తో కలిసి బైక్‌పై తిరిగి పత్తికొండవైపుకు వెళ్తుండగా చెరువు సమీపంలోని మలుపు వద్ద ఎదురుగా వచ్చిన ఆటో బైక్‌ను ఢీకొంది. ప్రమాదంలో కాలికి గాయమై రక్తస్రావమైంది. చికిత్స నిమిత్తం పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తీసుకెళ్లారు.

# నాటి సంకల్ప ఫలితమే నేటి సంక్షేమం



పత్తికొండలో వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

ఎమ్మిగనూరుటౌన్: బడుగు బలహీన వర్గాల వారి కష్టాలను నేరుగా తెలుసుకునేందుకు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాడు చేపట్టిన ప్రజాసంకల్పయాత్రతో నేటి సంక్షేమ పాలనకు నాందిగా నిలిచిందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజా సంకల్ప యాత్ర ప్రారంభించి ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం పట్టణంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. పార్టీ నాయకులతో స్థానిక వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఎంపీపీ కేశన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, పార్టీ జిల్లా కార్యదర్శి రియాజ్‌అహమ్మద్, పట్టణ అధ్యక్షుడు బుట్టారంగయ్య, తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని వైఎస్సార్ విగ్రహానికి రాష్ట్ర వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ రుద్రగౌడ్ పూలమాల వేసి నివాళులర్పించారు.

పత్తికొండ రూరల్: జననేత వైఎస్ జగనన్న ప్రజాసంకల్పయాత్ర చేపట్టి 6 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం పత్తికొండలోని పోస్టాఫీసు వద్ద దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్‌కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఎంపీపీ నారాయణదాస్, మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ, పల్లెప్రతాప్‌రెడ్డి, కారం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న ఎర్రకోట జగన్



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ రుద్రగౌడ్

కృష్ణగిరి: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ హయాంలో చేపట్టిన అభివృద్ధి, పేదలకు అందించే సంక్షేమ పథకాల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎవ్వరూ సాటిలేరని వైఎస్సార్‌సీపీ మండల యూత్ కన్వీనర్ లక్ష్మీకాంతరెడ్డి అన్నారు. ప్రజాసంకల్ప యాత్ర ప్రారంభించి ఆరేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మండల పరిధిలోని చుంచు ఎర్రగుడి గ్రామంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, గ్రామస్తులతో కలిసి వేడుకలు నిర్వహించారు. బాణాసంచా పేల్చి, పలువురికి స్వీట్లు పంచారు.









# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

మద్దికెర: ప్రజల ఆశీస్సులతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లయిందని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన హామీలు, నవరత్నాలతో పాటు మేనిఫెస్టోలోని పథకాలు 99 శాతం అమలు చేసి అర్హులైన ప్రతిఒక్కరికీ పార్టీలకతీతంగా అందిస్తున్నారని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. సోమవారం మద్దికెరలో 'రాష్ట్రానికి జగనే ఎందుకు మళ్లీ సీఎం కావాలి' అనే అంశంపై కార్యకర్తలు, నాయకులు, సచివాలయ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత టీడీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ వారికి మాత్రమే సంక్షేమ పథకాలు అందేవని, వైఎస్సార్ సీపీ పాలనలో అర్హత ఉంటే చాలు, ప్రతి ఒక్కరికీ ఇంటి వద్దకే అందిస్తున్నట్లు వివరించారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. రాష్ట్రంలో వైద్యం, విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చి తీర్చిదిద్దుతున్నారన్నారు. విద్యార్థులు విద్యనభ్యసించేందుకు అమ్మ ఒడితో పాటు ఉన్నత చదువు కోసం జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, జగనన్న విదేశీ విద్యాదీవెన పథకాలతో ఎంతోమంది విద్యార్థులకు లబ్ధి చేకూరుతోందన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం అప్పులు చేసి సొమ్మంతా కాజేసిందని సంక్షేమ పథకాలు మాత్రం అమలు చేయలేకపోయిందని విమర్శించారు. జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, ఐడీసీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, పత్తికొండ మార్కెట్ యార్డు చైర్మన్ పక్కీరప్ప, మండల కన్వీనర్ వెంకటేశులు, సొసైటీ అధ్యక్షుడు శాంతన్న, సుబ్బయ్య, సర్పంచు మల్లికార్జున, జిల్లా కార్యదర్శి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

### పార్టీలకతీతంగా సీఎం రిలీఫ్‌ఫండ్



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండ రూరల్ : సీఎం సహాయ నిధి కింద బాధిత కుటుంబాలకు పార్టీలకతీతంగా సాయం అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని కృష్ణగిరి, తుగ్గలి, వెల్దుర్తి, పత్తికొండ, మద్దికెర మండలాలకు చెందిన బాధిత కుటుంబాలకు సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. అమీనాబాద్ నాగేశ్వరరావుకు రూ.5లక్షలు, మారెళ్ల కప్పల దాసన్నకు రూ.2లక్షలు, ప్యాలకుర్తి రామదాసుకు రూ.1.70లక్షలు, కప్పల పులికొండ దొడ్డి ధనుంజయకు రూ.50వేలు, పత్తికొండ తిప్పారెడ్డికి రూ.20వేలు, తుగ్గలి బోయ రాజుకు రూ.2లక్షలు, జి.ఎర్రగుడి రాంగోపాల్‌రెడ్డికి రూ.55వేలు అందజేసినట్లు చెప్పారు. అలాగే కంబాలపాడు రాంచరణ్‌గౌడ్‌కు రూ.30వేలు, పత్తికొండ పింజరి హాజిరాబికి రూ.36వేలు, బురుజుల బెస్త హిమవర్షిణికి రూ.10వేలు, పత్తికొండ షేక్ మహమ్మద్‌కు రూ.4లక్షలు, బొమ్మిరెడ్డిపల్లి మాసపోగు సుంకన్నకు రూ.60 వేలు, అగ్రహారం వెంకటలక్ష్మికి రూ.1.20లక్షలు, మద్దికెర కంబగిరి రెడ్డికి రూ.40వేలు, పత్తికొండ నాగన్నకు రూ.52వేలు, చెన్నంపల్లి కొలిమిగుండ్ల భాగ్యమ్మ కు రూ.24వేలు, పందికోన గోవిందమ్మకు రూ.20వేలు, అమీనాబాద్ గొల్లజయచంద్రకు రూ.32వేలు, వెల్దుర్తి ఆకుల లలితకు రూ.1.20లక్షలు చెక్కులు మంజూరైనట్లు తెలిపారు. అర్హత ఉంటే చాలు తమ ప్రభుత్వం టీడీపీకి చెందిన కుటుంబాలకు కూడా సీఎం సహాయ నిధి అందిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నారాయణదాస్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కారం నాగరాజు,ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

## నిత్యావసర సరుకుల పంపిణీ

హొళగుంద: మండల పరిధిలోని మార్లమడికి, హొళగుంద గ్రామాల్లో అనాథలు, ఒంటరి వృద్ధులు, వికలాంగులు, నిరుపేదలకు సోమవారం ఆదోని వివేకానంద సేవా సంస్థ, భారత్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. స్వచ్ఛంద సేవా సంస్థల అధ్యక్ష, ఉపాధ్యక్షులు మూర్తి, ప్రకాష్, సిద్ధార్థగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## విజ్ఞాన ప్రదర్శనలో ప్రతిభ

గోనెగండ్ల: జిల్లా స్థాయి బాలల జాతీయ సైన్స్ కాంగ్రెస్ పోటీలలో గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థిని రమ్యశ్రీ ప్రతిభ చాటిందని పాఠశాల గైడ్ టీచర్ అమానుల్లా బేగ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఈనెల 4వ తేదీన కర్నూలులో జిల్లా స్థాయి బాలల జాతీయ సైన్స్ కాంగ్రెస్ పోటీలు నిర్వహించారని, ఈ పోటీల్లో రమ్యశ్రీ 'ఆకస్మిక ఉపద్రవాలైన వరదలు, భూకంపాలు, వైపరీత్యాల నుంచి రక్షణ పొందడం, సురక్షిత గృహాలను ఎలా నిర్మించుకోవాలి, ప్రతికూల పరిస్థితులలో జన నష్టం జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలనే చర్యలపై నమూనా ప్రాజెక్టు ప్రదర్శించింది. ఆ ప్రాజెక్టును పరిశీలించిన అధికారులు ఉత్తమ ప్రాజెక్టుగా ఎంపిక చేసి రమ్యశ్రీకు ఫీల్డ్, ప్రశంసా పత్రాన్ని డీఈఓ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా సోమవారం గోనెగండ్ల విద్యార్థిని రమ్యశ్రీని ఉపాధ్యాయులు అభినందించారు.

## శిబిరంలో 134 దరఖాస్తులు

మద్దికెర: ఓటరు నమోదు కార్యక్రమానికి మంచి స్పందన లభించిందని మొత్తం 134 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ నాగభూషణం అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ శని, ఆదివారాలలో రెండు రోజులు పాటు ఓటరు నమోదుకు ప్రత్యేక క్యాంపులు నిర్వహించడం జరిగిందన్నారు. ఫారం–6 ఓటరు నమోదుకు 44, ఫారం–7 తొలగించేందుకు 82, ఫారం -8 మార్పులు, చేర్పుల కోసం 8 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇంకా అర్హులైన వారు ఓటరు నమోదు చేసుకోవడానికి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

## నేడు 'రైతు భరోసా' మంజూరు

తుగ్గలి: వరుసగా ఐదో ఏడాది వైఎస్సార్ రైతు భరోసా రెండో విడత పెట్టుబడి సాయం మంగళవారం రైతుల ఖాతాల్లోకి జమ కానుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి డీబీటీ విధానంలో బటన్ నొక్కి నిధులను విడుదల చేయనున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభానికి ముందే రూ.7,500 ప్రకారం రైతులు ఖాతాలో జమచేయగా ప్రస్తుతం రబీ పెట్టుబడులకుగాను రూ.4 వేలు అందించనున్నారు. పంట నూర్పిడి సమయంలో జనవరిలో మూడో విడతగా రూ.2 వేలు ప్రకారం అందిస్తారు. మండలంలో 14,521 మంది రైతులకు రైతు భరోసా సాయం జమ అవుతుందని ఏఓ చెప్పారు.

## పేదల ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్

పత్తికొండ రూరల్: పేదలకు పంపిణీ చేసిన ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ చేయిస్తున్నట్లు రాష్ట్ర శాలివాహన ఫెడరేషన్ మాజీ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, సతీమణి మాజీ జెడ్పీటీసీ వరలక్ష్మి అన్నారు. సోమవారం పత్తికొండ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో లబ్ధిదారులకు ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేశారు. తుగ్గలిలో తమకు చెందిన 12 ఎకరాల భూమిలో 670 మందికి ఒకటిన్నర సెంట్ల ప్రకారం ఇళ్ల స్థలాలు పంపిణీ చేశామన్నారు. ప్రస్తుతం వారికి శాశ్వత హక్కు కల్పించేందుకు రిజిస్ట్రేషన్ చేయించి ఇస్తున్నట్లు వెల్లడించారు.

# బతుకుబాటలో మృత్యు ఒడికి..




బోయ రామాంజి (ఫైల్ ), ప్రమాదంలో గాయపడ్డ బోయ కృష్ణ

ఎమ్మిగనూరురూరల్: బతుకుదెరువు నిమిత్తం డ్రైవింగ్ వృత్తిని ఎంచుకున్న అనంతపురం జిల్లా గుంతకల్లు పట్టణానికి చెందిన బోయ రామాంజి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కోటేకల్ గ్రామ కొండ రెండవ మలుపు దగ్గర బొలెరో, లారీ ఢీకొనడంతో ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ దుర్ఘటన చోటుచేసుంది. ప్రమాదంలో మరో ఇద్దరు గాయపడ్డారు. గుంతకల్లు రాయల్ సర్కిల్లోని కథలగేరి తిలక్‌నగర్‌కు చెందిన బోయ గురవయ్య, సావిత్రమ్మలకు ఒక్కగానొక్క కుమారుడు బోయ రామాంజి(31). ఏడు నెలల క్రితం గుంతకల్లులోని మేనమామ ఎర్రిస్వామి కుమార్తె శైలజతో వివాహమైంది. తండ్రి చీరల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తుండగా రామాంజి సొంతంగా బొలెరో వ్యాన్ కొని అద్దెకు తిప్పుతుండేవాడు. గుంతకల్లు నుంచి కాలీఫ్లవర్ లోడ్ హైదరాబాద్‌కు తీసుకెళ్లి అక్కడ అన్‌లోడ్ చేశాడు. అక్కడ నుంచి గుంతకల్లుకు తిరిగి వస్తుండగా ఆదోనిలో ఓ ఇంటికి సామాన్లను దించాలని బాడుగ రావటంతో వాటిని లోడ్ చేసుకున్నాడు. హైదరాబాద్‌లో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న తన స్నేహితుడు బోయ కృష్ణకు ఫోన్ చేసి వ్యాన్‌లో ఎక్కించుకొని ఊరికి బయలుదేరాడు. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంటిగంట సమయంలో కోటేకల్ కొండ రెండో మలుపు దగ్గర ఆదోని నుంచి కర్నూలు వైపు వస్తున్న లారీ, ఆదోనికి వెళ్తున్న బొలెరో వ్యాన్ ఢీ కొట్టుకున్నాయి. ప్రమాదంలో వ్యాన్ నుజ్జునుజ్జు అయ్యింది. డ్రైవర్ బోయ రామాంజి కుడి చేయి తెగి దూరంగా పడిపోయి.. డ్రైవర్ సీట్లు ఇర్కుపోయాడు. బోయ కృష్ణ వ్యాన్ క్యాబిన్‌ల్లో ఇరుక్కుపోయారు. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న 108, రోడ్ సెఫ్టీ సిబ్బంది, రూరల్ పోలీసులు అక్కడి చేరుకున్నారు. బొలెరో వ్యాన్‌లో ఇరుక్కున్న డ్రైవర్ బోయ రామాంజిని జేసీబీని తెప్పించి రెండు గంటల పాటు శ్రమించి బయటకు తీశారు. గొంతు పూర్తిగా కోసుకుపోయి వ్యాన్‌లో డ్రైవర్ రామాంజి మృతిచెందాడు. ప్రమాదంలో గాయపడ్డ బోయ కృష్ణను ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇదే ప్రమాదంలో గాయపడ్డ లారీ డ్రైవర్ సంజీవను ఆదోని ప్రభుత్వాసుపత్రికి 108లో తరలించారు. ప్రమాద స్థలాన్ని రూరల్ సీఐ మోహన్‌రెడ్డి పరిశీలించారు. ప్రమాద విషయాన్ని పోలీసులు గుంతకల్లులోని మృతుడి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. మృతుడి తల్లి సావిత్రమ్మ రెండు నెలల క్రితమే అనారోగ్యంతో మృతి చెందగా, ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందటంతో తండ్రి, భార్య శోకసంద్రంలో మునిగిపోయారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకుఅప్పగించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ మోహన్‌రెడ్డి, ఏఎస్ఐ రుక్మిణి తెలిపారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి

గోనెగండ్ల: పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సుపరిపాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం గోనెగండ్ల 10వ వార్డులో అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకుని, ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీడీపీ అధినేత చంద్రబాబు ధనికుల కోసం పని చేస్తే, పేదల సంక్షేమం కోసం సీఎం జగనన్న పని చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే ఇందుకు నిదర్శనమన్నారు. వైఎస్సార్ ఆశయాలను పుణికిపుచ్చుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్ర సమయంలో పేదల కష్టాలను స్వయంగా చూసి అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి నవరత్నాలు ప్రవేశపెట్టి అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేయడం ప్రారంభించారని వివరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లోనూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డినే ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఎస్‌బీ మన్సూర్, యూత్ అధ్యక్షుడు బందెనవాజ్, సింగిల్ విండో ఉపాధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, కన్వీనర్ దొరబాబు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ విజేత కర్నూలు



విజేత కర్నూలు బాలుర జట్టుకు ట్రోఫీ అందిస్తున్న డీఈఓ రంగారెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని డీఈఓ డాక్టర్ రంగారెడ్డి సూచించారు. ఎమ్మిగనూరు పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో మూడు రోజులపాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 67వ అంతర్ రాష్ట్ర ఫుట్‌బాల్ ఛాంపియన్ షిప్ అండర్–17 బాలుర, బాలికల పోటీలు సోమవారం సాయంత్రం ముగిశాయి. రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి బాలుర, బాలికల జట్లు తలపడ్డాయి. బాలుర విభాగం ఫైనల్ పోటీల్లో విజేతగా కర్నూలు జిల్లా జట్టు నిలిచింది. ద్వితీయ స్థానం విజయనగరం జట్టు, తృతీయ స్థానం చిత్తూరు జట్టు కైవసం చేసుకున్నాయి. బాలికల విభాగంలో విజేతగా వైఎస్సార్ జిల్లా జట్టు నిలిచింది. ద్వితీయ స్థానంలో అనంతపురం, తృతీయ స్థానం కర్నూలు జిల్లా జట్టు కైవసం చేసుకుంది. విజేతలకు డీఈఓ చేతులమీదుగా ట్రోఫీ, మెడల్స్, ప్రశంసా పత్రాలను అందజేశారు. బెస్ట్ ప్లేయర్‌గా నిలిచిన కర్నూలు జట్టు క్రీడాకారుడు గణేష్‌కు సైకిల్‌ను బహుకరించారు. బెస్ట్ టీంగా వెస్ట్‌గోదావరి నిలిచింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఈఓ మాట్లాడుతూ.. క్రీడల వల్ల ఆరోగ్యంతో పాటు దేహదారుఢ్యం లభిస్తుందన్నారు. క్రీడాకారులకు తమలో ఉన్న ప్రతిభను చాటుకొనే అవకాశం లభిస్తుందన్నారు. క్రీడాకారులు గెలుపోటములను స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్‌లో జరిగే పోటీల్లో ఉన్నతంగా రాణించాలన్నారు. పోటీల రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ ప్రభాకర్, ఉమ్మడి కర్నూలు జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు జోసెఫ్ లక్ష్మయ్య, శివకుమార్, ఎంఈఓలు ఆంజినేయులు, మధుసుదన్‌రాజు, ఫుట్‌బాల్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

# ఫుట్‌బాల్ రాష్ట్ర జట్ల ప్రకటన

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్, 67వ అంతర్ రాష్ట్ర ఫుట్‌బాల్ ఛాంపియన్ షిప్ అండర్–17 బాలుర, బాలికల పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన బాలుర జట్టు అండమాన్ నికోబార్‌లోను, బాలికల జట్టు బీహార్ రాష్ట్రం పాట్నాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఫైనల్ పోటీల అనంతరం ఎస్‌జీఎఫ్ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యదర్శి జోసెఫ్ లక్ష్మయ్య, పోటీల రాష్ట్ర పరిశీలకుడు డాక్టర్ ప్రభాకర్ రాష్ట్ర జట్లను ప్రకటించారు. బాలుర రాష్ట్ర జట్టులో విజయనగరంకు చెందిన జయసూర్య, జాన్సీరాజు, చైతన్య, కర్నూలు జిల్లా నుంచి బి.ఈశ్వర్, సి.గణేష్, దాదాఖలందర్, అభిరామ్ రాజ్, చిత్తూరుకు చెందిన నరేష్, నితిన్, విష్ణువర్దన్, వెస్ట్‌గోదావరికి చెందిన సంతోష్, సక్సాంత్, విశాఖపట్టణంకు చెందిన గురుచరణ్, శ్రీకాకుళంకు చెందిన సంపత్‌కుమార్, ఈస్ట్‌గోదావరికి చెందిన సాయి సూర్యహర్షరెడ్డి, వైఎస్ఆర్ జిల్లా అడ్రినాల్డ్ జార్జి వాకిన్స్, గుంటూరుకు చెందిన అఫ్రోజ్, కృష్ణా జిల్లాకు చెందిన హర్షవర్ధన్ రాజు ఎంపికైనట్లు ప్రకటించారు. బాలికల రాష్ట్ర జట్టుకు అనంతపురం జిల్లాకు చెందిన పావని, అక్షిత, అల్మాస్, వైఎస్సార్ జిల్లాకు చెందిన అరుణ, దేవి, శ్రావణి, కర్నూలు జిల్లాకు చెందిన సుమాంజలి, అస్మసహాన్, ఇందు, విశాఖపట్టణంకు చెందిన కావ్య, రోహిణి, గుంటూరు జిల్లాకు చెందిన శిలక్ష్మి, వెస్ట్ గోదావరి జిల్లాకు చెందిన సుస్మిత, కృష్ణా జిల్లాకు చెందిన అపర్ణ, విజయనగరం నుంచి లలిత, ఈస్ట్ గోదావరి జిల్లాకు చెందిన భవాని సునయన, నెల్లూరు జిల్లాకు చెందిన కావ్య, చిత్తూరు జిల్లాకు చెందిన హర్షిత, భవాని ఎంపికైనట్లు వెల్లడించారు.

# పత్తికొండ ఎమ్మెల్యే శ్రీమతి కంగాటి శ్రీదేవి గారికి జన్మదిన శుభాకాంక్షలు.











## వృద్ధాశ్రమంలో అన్నదానం

పత్తికొండ రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సంకల్ప యాత్రను ప్రారంభించి 6 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం పత్తికొండలోని శారద వృద్ధాశ్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు పోచిమి రెడ్డి మురళీధర్‌రెడ్డి అన్నదానం ఏర్పాటుచేశారు. ఎంపీటీసీ అనిత, నాగరాజు, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.